క్లుప్తంగా

విద్యుత్ అధికారుల పొలం బాట



పొలం బాటలో ఏఈ, సిబ్బంది, రైతులు

కథలాపూర్: మండలంలోని బొమ్మెన, తక్కళ్ల పెల్లి గ్రామాల్లో బుధవారం విద్యుత్ అధికారులు పొలం బాట కార్యక్రమం నిర్వహించారు. వ్యవసాయ విద్యుత్ మోటార్లను పరిశీలించి తీసుకోవాల్సిన జాగ్రత్తలను రైతులకు వివరించారు. మోటార్లకు కెపాసిటర్లు బిగించుకుంటే పనితీరు మెరుగ్గా ఉంటుందని, విద్యుత్‌ను ఆదా చేసినట్లవుతుందన్నారు. ఏఈ దివాకర్ రావు, లైన్‌మెన్ భూమేశ్వర్, కొమ్ముల కిషన్ రెడ్డి, అర్జున్ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీలకు ఎంపిక



శివకుమార్‌ను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

మల్యాల: మండల కేంద్రంలోని జెడ్పీ స్కూల్‌కు చెందిన విద్యార్థి శివకుమార్ జిల్లాస్థాయి పోటీలో ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీలకు ఎంపికయ్యాడు. ఈ నెల 16 నుంచి 18 వరకు మెదక్‌లో జరిగే పోటీల్లో పాల్గొంటాడు. ఈ సందర్భంగా విద్యార్థిని హెచ్‌ఎం అనుపమ, పాఠశాల చైర్మన్ రజిత, పీడీ విశ్వప్రసాద్, ఉపాధ్యాయులు అభినందించారు.

సెల్‌ఫోన్ అప్పగింత



సెల్‌ఫోన్ అప్పగిస్తున్న ఎస్సై రవికిరణ్

పెగడపల్లి: మండల కేంద్రానికి చెందిన పుల్ల మల్లేశం సెల్‌ఫోన్ పోగొట్టుకున్నాడు. బాధితుడు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా, సీఈఐఆర్ పోర్టల్‌లో వివరాలు నమోదు చేశారు. సెల్‌ఫోన్‌ను గుర్తించి బుధవారం మల్లేశంకు అందజేసినట్లు ఎస్సై రవికిరణ్ తెలిపారు.

మట్టి కుప్పల పరిశీలన



మట్టి కుప్పల వద్ద అధికారులు

మల్యాల: మండలంలోని ముత్యంపేట శివారులో వరదకాలువ మట్టి కుప్పలను జగిత్యాల మైనింగ్ ఏడీ జయసింగ్ పరిశీలించారు. జాతీయ రహదారి కోసం అవసరమైన మట్టిని తరలించేందుకు 80.45 కిలోమీటరు వద్ద మట్టి కుప్పలను పరిశీలించారు. ఏఈ శ్రీకాంత్, మైనింగ్ ఆర్ఐ తిరుపతిరావు, వర్కింగ్ ఇన్‌స్పెక్టర్ మహేశ్ పాల్గొన్నారు.

రుణమాఫీ చేసిన ఘనత కాంగ్రెస్‌దే



అడువాల జ్యోతి, మున్సిపల్ చైర్‌పర్సన్

జగిత్యాల: రైతులకు రూ.2 లక్షల రుణమాఫీ చేసిన ఘనత కాంగ్రెస్ పార్టీదేనని మున్సిపల్ చైర్‌పర్సన్ అడువాల జ్యోతి అన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, కాంగ్రెస్ పార్టీ, ముఖ్యమంత్రిపై బీఆర్ఎస్ నాయకులు చేసిన విమర్శలు అర్థరహితమని, పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో తెలంగాణ పేరుతో రైతులను, ప్రజలను, విద్యార్థులను, నిరుద్యోగులను మోసం చేశారని ఆరోపించారు. పట్టణాభివృద్ధికి వారు చేసిందేమిటో చెప్పాలని డిమాండ్ చేశారు. సీఎం రేవంత్‌రెడ్డి ఏడాది పాలనలో ఎంతో అభివృద్ధి చేశారని పేర్కొన్నారు.

క్షీరాభిషేకం

కథలాపూర్: మండలంలోని సిరికొండ గ్రామంలో బుధవారం సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రి ప్రభాకర్, విప్ ఆది శ్రీనివాస్ చిత్రపటాలకు రైతులు, కాంగ్రెస్ నాయకులు క్షీరాభిషేకం చేశారు. సిరికొండలో విద్యుత్ సబ్‌స్టేషన్ కోసం రూ.2.25 కోట్లు ప్రభుత్వం మంజూరు చేయడంపై హర్షం వ్యక్తం చేశారు. కాయితి నాగరాజు, ఎండీ హఫీజ్, మ్యాదరవేని రాజు, అజీమ్, ఏనుగు అశోక్‌రెడ్డి, ముబీన్, ముంజ నందం, జలంధర్, ఆకుల నర్సయ్య పాల్గొన్నారు.

ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

ఇబ్రహీంపట్నం: మండలంలోని కోమటికొండపూర్ గ్రామంలో మంగళవారం రాత్రి అక్రమంగా ఇసుక రవాణా చేస్తున్న 4 ట్రాక్టర్లను పట్టుకున్నట్లు తహసీల్దార్ ప్రసాద్ బుధవారం తెలిపారు. ట్రాక్టర్లను సీజ్ చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించినట్లు పేర్కొన్నారు. అలాగే 40 ట్రిప్పుల ఇసుక డంపులను గుర్తించి సీజ్ చేసినట్లు వివరించారు. కార్యక్రమంలో ఆర్ఐ రేవంత్‌రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

వైభవం.. వెంకన్న కల్యాణం



కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు



వేడుకలకు హాజరైన భక్తులు

కోరుట్లరూరల్: మండలంలోని వెంకటాపూర్ శివారులో గుట్టపై గల శ్రీవేంకటేశ్వర ఆలయం బ్రహ్మోత్సవాల్లో భాగంగా బుధవారం స్వామివారి కల్యాణం వైభవంగా నిర్వహించారు. ప్రత్యేక పూజలు, అర్చనలు, అభిషేకాల అనంతరం భక్తుల కోలాహలం నడుమ కల్యాణం జరిపించారు. తర్వాత అన్నదానం చేశారు. ఎమ్మెల్యే కల్వకుంట్ల సంజయ్ కల్యాణోత్సవంలో పాల్గొని పూజలు చేశారు.

ధ్వజస్తంభం ప్రతిష్ఠాపన



పూజలు చేస్తున్న కోరుట్ల ఎమ్మెల్యే సంజయ్

మల్లాపూర్: మండలంలోని గొర్రెపల్లిలో బుధవారం శ్రీమహాదేవ స్వామి ధ్వజస్తంభం ప్రతిష్ఠాపన ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్‌కుమార్ పాల్గొన్ని స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. ప్రజాప్రతినిధులు, భక్తులు పాల్గొన్నారు.

తేమశాతం పరిశీలించి తూకం వేయాలి

• అదనపు కలెక్టర్ బీఎస్ లత



ధాన్యం కొనుగోళ్ల వివరాలు తెలుసుకుంటున్న అదనపు కలెక్టర్ లత

కథలాపూర్: మండలంలోని తాండ్య్రాల, గంభీర్‌పూర్, బొమ్మెన, కథలాపూర్ గ్రామాల్లో వరిధాన్యం కొనుగోలు కేంద్రాలను బుధవారం అదనపు కలెక్టర్ బీఎస్ లత పరిశీలించారు. రోజూ సీరియల్‌గా ధాన్యం కుప్పల తేమశాతం పరిశీలించి తూకం వేయాలన్నారు. తూకం వేసిన ధాన్యంను మిల్లులకు తరలించి ట్యాబ్‌లో వెంటనే నమోదు చేయాలన్నారు. ఆమె వెంట డీఎస్‌వో జితేందర్‌రెడ్డి, తహసీల్దార్ వినోద్, ఆర్ఐ నరేశ్, సీఈవో ఉశకోల అరుణ్, సీసీలు ఉన్నారు.

కొనుగోలు కేంద్రాల సందర్శన

పెగడపల్లి: మండల కేంద్రంతో పాటు మండలంలోని రామ్‌నగర్‌లోని ధాన్యం కొనుగోలు కేంద్రాలను బుధవారం ఆర్డీవో పులి మధుసూదన్ సందర్శించారు. ధాన్యం కొనుగోళ్లు, మిల్లర్లకు తరలించిన వివరాలు తెలుసుకున్నారు. ధాన్యం తూకంలో రైతులు సమన్వయం పాటించాలని, చివరి గింజ వరకు ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. ధాన్యం కొనుగోలు విషయంలో నిర్వాహకులు, మిల్లర్లు ఇబ్బందులు పెడితే తమ దృష్టికి తేవాలని పేర్కొన్నారు. తహసీల్దార్ బోడ రవీందర్, ఆర్ఐలు శ్రీనివాస్, జమున, నిర్వాహకులు పాల్గొన్నారు.

నియామకం

మాలమహానాడు నూతన కార్యవర్గం



నూతన కార్యవర్గం

కథలాపూర్: మాల మహానాడు మండల అధ్యక్షుడిగా అంబారిపేటకు చెందిన దయ్య ప్రశాంత్ ఎన్నికయ్యాడు. బుధవారం కథలాపూర్‌లో మండల కమిటీ ఎన్నికలు నిర్వహించారు. ఉపాధ్యక్షులుగా భూషణరావుపేటకు చెందిన తలారి మోహన్, అంబటి రాధాకృష్ణ, ప్రధాన కార్యదర్శిగా బొమ్మెన గ్రామానికి చెందిన జంగం నరేశ్, కోశాధికారిగా బోడ నాగరాజు ఎన్నికయ్యారు.

చేనేత ఐక్యవేదిక రాష్ట్ర కార్యదర్శిగా..



తిరుపతి

మెట్‌పల్లి: తెలంగాణ చేనేత ఐక్యవేదిక రాష్ట్ర కార్యదర్శిగా పట్టణానికి చెందిన జడల తిరుపతిని నియమించినట్లు రాష్ట్ర అధ్యక్షుడు రాపోలు వీరమోహన్ బుధవారం తెలిపారు. చేనేత కార్మికుల సమస్యల పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానని తిరుపతి పేర్కొన్నాడు.

సమగ్ర ఇంటింటి సర్వేలో ఇంక్‌ప్యాడ్ కరువు

• పెన్ ఇంక్‌పూసి సంతకాలు



బాల్‌పాయింట్ పెన్‌తో వేలికి ఇంక్ పూస్తున్న ఉద్యోగి

జగిత్యాలటౌన్: జిల్లాలో సమగ్ర సర్వే తీరు చిత్రంగా ఉంది. అన్నిరకాల స్టేషనరీ సరఫరా చేశామని ప్రభుత్వం చెబుతుంటే సర్వే అధికారులు మాత్రం ఇంక్ ప్యాడ్ లేక పెన్‌తో వేలికి ఇంక్ పూస్తూ సర్వే ఫాంలో సంతకాలు తీసుకుంటున్నారు. సర్వేపై హడావుడి చేస్తున్న అధికారులు స్టేషనరీ విషయంలో నిర్లక్ష్యం వహించడం ప్రభుత్వ డొల్లతనానికి నిదర్శనంగా కనిపిస్తోంది.

పెగడపల్లి భవనం



పెగడపల్లి: మండల కేంద్రంలో ఇంటిగ్రేటెడ్ బాలుర వసతి గృహ నిర్మాణం పిల్లర్లకే పరిమితమైంది. భవన నిర్మాణానికి ఎస్సీ కార్పొరేషన్ నుంచి రూ.2 కోట్లు మంజూరయ్యాయి. కాంట్రాక్టర్ పిల్లర్ల వరకు పనులు చేసి ఆపేశాడు. పనులు ఆగిపోయి నెలలు కావస్తున్నా సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. అయితే నిర్మాణం జరిగిన వరకు ప్రభుత్వం నుంచి బిల్లు చెల్లింపులో జాప్యం కారణంగా కాంట్రాక్టర్ పనులు చేయడం లేదని సంబంధిత అధికారులు చెబుతున్నారు. పనులు త్వరగా పూర్తిచేసి అందుబాటులోకి తేవాలని విద్యార్థులు, స్థానికులు కోరుతున్నారు.

సమస్య పరిష్కారానికి సంప్రదించాల్సిన అధికారి
ధనుంజయ్, ఎడ్యుకేషనల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఏఈ సెల్ : 88975 36486

వాట్సాప్ చేయండి..

మీ ప్రాంతంలో ఉన్న సమస్యను, దానికి సంబంధించిన ఫొటోను మాకు వాట్సాప్‌లో షేర్ చేయండి. ఆ సమస్య ఎప్పటి నుంచి ఉందో రాయండి. వాటిని ప్రచురించి సమస్య పరిష్కారానికి 'సాక్షి' కృషి చేస్తుంది. పంపిన వారి పేరు, ఫొటో ప్రచురిస్తాం.

మా ఫోన్ నంబర్: 9705346639, 9440061630, 9705346643

చక్కెర ఫ్యాక్టరీని మూసివేయించిన ఘనత బీఆర్‌ఎస్‌దే



మాట్లాడుతున్న కృష్ణారావు

కోరుట్ల: కోరుట్ల నియోజకవర్గంలో ఏకైక వ్యవసాయ ఆధారిత ముత్యంపేట చక్కెర కర్మాగారాన్ని మూసివేయించిన ఘనత గత బీఆర్ఎస్ ప్రభుత్వానిదే అని కాంగ్రెస్ రాష్ట్ర నాయకుడు జువ్వాడి కృష్ణారావు అన్నారు. బుధవారం పట్టణంలోని జువ్వాడి భవన్‌లో మాట్లాడారు. చక్కెర ఫ్యాక్టరీ తెరిపించకుంటే గేటుకు ఉరి వేసుకుంటానన్న మాజీ ఎమ్మెల్యే విద్యాసాగర్‌రావు ఇప్పుడు కొడుకు ఎమ్మెల్యే సంజయ్‌తో రైతు పాదయాత్ర చేయించటం సిగ్గుచేటన్నారు. రాష్ట్రంలో కేసీఆర్, కేటీఆర్ ఇక్కడ విద్యాసాగర్‌రావు, సంజయ్ ప్రజలను మభ్యపెడుతున్నారని విమర్శించారు. కల్వకుంట్ల కుటుంబాన్ని ప్రజలు విశ్వసించరని పేర్కొన్నారు. కాంగ్రెస్ గద్దెనెక్కిన మరుక్షణం నుంచి బీఆర్ఎస్ ఏదో రకంగా ప్రభుత్వంపై బురద చల్లటమే తప్ప చేసిందేమీ లేదన్నారు. ప్రజలు తిరస్కరించినా బీఆర్ఎస్ నేతలకు బుద్ధి రావడం లేదని విమర్శించారు. సమావేశంలో కాంగ్రెస్ పట్టణ, మండల అధ్యక్షులు తిరుమల గంగాధర్, కొంతం రాజం, కౌన్సిలర్లు, నాయకులు పాల్గొన్నారు.

ప్రభుత్వ విప్‌ను కలిసిన అధికారులు



విప్ అడ్లూరికి పుష్పగుచ్ఛం ఇస్తున్న డీఎంహెచ్‌వో ప్రమోద్‌కుమార్

ధర్మపురి: మెట్‌పెల్లి డీఎస్పీగా బాధ్యతలు చేపట్టిన రాములు బుధవారం ధర్మపురిలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్‌కుమార్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. అలాగే విప్‌ను జిల్లా వైద్యాధికారిగా బాధ్యతలు చేపట్టిన ప్రమోద్‌కుమార్ మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. కార్యక్రమంలో డిప్యూటీ డీఎంహెచ్‌వో శ్రీనివాస్ తదితరులున్నారు.

కోరుట్ల ఎమ్మెల్యేను కలిసిన డీఎంహెచ్‌వో

కోరుట్ల: డీఎంహెచ్‌వో ప్రమోద్‌కుమార్ బుధవారం కోరుట్ల ఎమ్మెల్యే కల్వకుంట్ల సంజయ్‌ను మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. కార్యక్రమంలో డిప్యూటీ డీఎంహెచ్‌వో శ్రీనివాస్, ధనుంజయ, మల్లికార్జున్ తదితరులు పాల్గొన్నారు.

బీమా పథకాలను సద్వినియోగం చేసుకోవాలి



అవగాహన కల్పిస్తున్న మధుసూదన్

మల్లాపూర్: కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న బీమా పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా లీడ్ బ్యాంక్ ఎఫ్ఎల్సీ కోట మధుసూదన్ అన్నారు. బుధవారం మండలంలోని సిరిపూర్ గ్రామంలో బీమా పథకాల నమోదు కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. ఆర్‌బీఐ మార్గదర్శకాలకు అనుగుణంగా కేంద్ర ప్రభుత్వం జాతీయ బ్యాంకుల్లో అమలు చేస్తున్న బీమా పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లి అవగాహన కల్పించాలని సూచించారు. కేంద్ర ప్రభుత్వం రూ.399, రూ.299 బీమా పాలసీలను అందుబాటులోకి తీసుకువచ్చిందని వివరించారు. ఈ బీమా పొందినవారు రోడ్డుప్రమాదం, పాము కాటు, గుండెపోటు, విద్యుదాఘాతంతో మృత్యువాత పడితే రూ.10 లక్షల జనరల్ ఇన్సూరెన్స్ అందిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఐకేపీ ఏపీఎం దేవరాజ్, యూనియన్ బ్యాంక్ మేనేజర్ శంకర్, పంచాయతీ కార్యదర్శి నరేశ్ తదితరులు పాల్గొన్నారు.

ఎల్‌వోసీ అందజేత



ఎల్‌వోసీ అందజేస్తున్న ఎమ్మెల్యే సంజయ్‌కుమార్

సారంగాపూర్: వెన్నెముక సమస్యతో బాధపడుతున్న ఓ మహిళ చికిత్స కోసం జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ రూ.2.50 లక్షల విలువ చేసే ఎల్‌వోసీని బుధవారం బాధిత కుటుంబ సభ్యులకు అందజేశారు. మండలంలోని బట్టపల్లి గ్రామానికి చెందిన కె.రమాదేవి వెన్నెముక సమస్యతో బాధపడుతోంది. నిమ్స్‌లో చికిత్స చేయించుకునేందుకు ఎమ్మెల్యే ఎల్‌వోసీ అందించారు. ఈ సందర్భంగా రమాదేవి, ఆమె కుటుంబ సభ్యులు ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు.

ఆశ్రమాలు, పాఠశాల సంస్థలకు రిజిస్ట్రేషన్ తప్పనిసరి

జగిత్యాల: దివ్యాంగుల సంక్షేమానికి జిల్లాలో నిర్వహించే ఆశ్రమాలు, పాఠశాలల, వివిధ సంస్థలకు రిజిస్ట్రేషన్ తప్పనిసరి అని జిల్లా సంక్షేమాధికారి బోనగిరి నరేశ్ అన్నారు. అనుమతి లేకుండా ఆశ్రమాలు, సంస్థలు నిర్వహిస్తే చర్యలు తీసుకుంటామన్నారు. రిజిస్ట్రేషన్ కోసం ఈనెల 15లోపు కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలని, రిజిస్ట్రేషన్ లేని సంస్థలపై ఈనెల 16 తర్వాత చర్యలు తప్పవన్నారు. వివరాలకు టోల్‌ఫ్రీ నంబరు 155326 సంప్రదించాలని కోరారు.

తప్పుల్లేకుండా ఇంటింటి కుటుంబ సర్వే చేపట్టాలి



సర్వేను పరిశీలిస్తున్న డీఆర్‌డీవో రఘువరన్

ఇబ్రహీంపట్నం: తప్పులు, కొట్టివేతలు లేకుండా ఇంటింటి సర్వే చేయాలని డీఆర్‌డీవో, మండల ప్రత్యేకాధికారి రఘువరన్ సూచించారు. బుధవారం ఇబ్రహీంపట్నంలో సర్వే తీరును పరిశీలించారు. ఎంపీడీవో చంద్రశేఖర్, పంచాయతీ కార్యదర్శి రామకృష్ణ, ఎన్యూమరేటర్లు పాల్గొన్నారు.

వేగం పెంచాలి

పెగడపల్లి: సమగ్ర కుటుంబ సర్వేలో వేగం పెంచి ప్రభుత్వం నిర్దేశించిన గడువులోపు పూర్తి చేయాలని మండల ప్రత్యేకాధికారి, జిల్లా వెటర్నరీ అధికారి మనోహర్ సూచించారు. బుధవారం ఎంపీడీవో శ్రీనివాస్‌రెడ్డితో కలిసి మండలంలోని దోమలకుంట గ్రామాన్ని సందర్శించారు. ఇంటింటా సర్వే జరుగుతున్న తీరును పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రతీ కుటుంబాన్ని సందర్శించి పకడ్బందీగా వివరాలు నమోదు చేయాలన్నారు. మండలంలో మొత్తం 15 వేల కుటుంబాల వరకు ఉండగా ఇప్పటి వరకు 5,902 కుటుంబాల సర్వే వివరాలు నమోదు చేసినట్లు ఎంపీడీవో వివరించారు. ఆయన వెంట ఎంపీవో మహేందర్ ఉన్నారు.

కొనసాగుతున్న సర్వే

సారంగాపూర్: సారంగాపూర్, బీర్‌పూర్ మండలాల్లోని ఆయా గ్రామాల్లో సమగ్ర ఇంటింటి సర్వే కొనసాగుతుంది. బుధవారం ఎంపీడీవో గంగాధర్ సారంగాపూర్‌లో సర్వే తీరును పరిశీలించి ఎన్యుమరేటర్లకు పలు సూచనలు చేశారు. ఆయన వెంట పంచాయతీ కార్యదర్శి ప్రేమలత, కారోబార్ గంగాధర్ తదితరులు ఉన్నారు.

కోర్టుకు హాజరైన రైతు సంఘం నాయకులు

జగిత్యాలజోన్: గతంలో పోలీసులు పెట్టిన కేసు విచారణ నిమిత్తం బుధవారం దాదాపు 15 మంది రైతు సంఘం నాయకులు జగిత్యాల కోర్టుకు హాజరయ్యారు. రాష్ట్ర రైతు ఐక్యవేదిక ముఖ్య నాయకుడు పన్నాల తిరుపతిరెడ్డి మాట్లాడుతూ.. రైతులపై కేసులు ఎత్తివేస్తామని చెప్పిన రేవంత్ ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు. వ్యవసాయ పనులు విడిచి పెట్టుకుని కోర్టుకు రావాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. కోర్టుకు హాజరైన వారిలో రైతు సంఘం నాయకులు రాంరెడ్డి, సాగర్‌రావు, గంగారెడ్డి, భూంరెడ్డి, మల్లయ్య, తీపిరెడ్డి రత్నాకర్, అయిల్నేని విక్రమ్, గోలి జనార్దన్, రాజగోపాల్, శ్యాంసుందర్, గోపాల్‌రెడ్డి ఉన్నారు.

'విశ్వశాంతి'లో బాలల దినోత్సవం



బాలల దినోత్సవంలో విద్యార్థులు

రాయికల్: పట్టణంలోని విశ్వశాంతి ఉన్నత పాఠశాలలో బుధవారం ముందస్తుగా బాలల దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ప్రిన్సిపాల్ మచ్చ గంగాధర్ మాట్లాడుతూ, జవహర్‌లాల్ నెహ్రూ జన్మదినోత్సవం రోజున బాలల దినోత్సవం నిర్వహిస్తున్నామన్నారు. డైరెక్టర్లు మచ్చ లలిత, విద్యాన్వేష్, ఉపాధ్యాయులు రంజిత్, మహేశ్, రజిత, స్రవంతి పాల్గొన్నారు.


రవీంద్ర ప్లే స్కూల్‌లో..



దేవుళ్ల వేషధారణలో చిన్నారులు

జగిత్యాల: జిల్లా కేంద్రంలోని రవీంద్ర ప్లే స్కూల్‌లో బాలల దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా చిన్నారులు వివిధ వేషధారణలతో అలరించారు. పాఠశాల డైరెక్టర్ శ్రీధర్ రావు, సుమన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

చరణ్ వైద్యానికి చేయూత



చరణ్ తండ్రికి ఆర్థికసాయం చేస్తున్న పద్మశాలీ సేవా సంఘం సభ్యులు

రాయికల్: మండలంలోని కుమ్మరిపల్లికి చెందిన సిరిపురం చరణ్ వైద్యానికి దాతలు చేయూతనిస్తున్నారు. బుధవారం కుమ్మరిపల్లిలోని పద్మశాలీ సేవా సంఘం రూ.26 వేలు, జగిత్యాల రూరల్ మండలం జాబితాపూర్‌కు చెందిన అనుమల్ల అనిత రూ.15 వేలు, రాయికల్ పట్టణానికి చెందిన ఎనగందుల శివాజీ రూ.10 వేలు అందజేశారు. మొత్తం రూ.3.50 లక్షల వరకు ఆర్థికసాయం అందించారు.

ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలని వినతి

జగిత్యాల: ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలని పీఆర్టీయూ అధ్యక్ష, కార్యదర్శులు ఆనంద రావు, యాళ్ల అమర్‌నాథ్‌రెడ్డి కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన సమగ్ర కుటుంబ ఇంటింటి సర్వేలో ఉపాధ్యాయులు పాల్గొంటున్నారని తెలిపారు. కానీ ప్రతీ ఇంట్లో సర్వేకు దాదాపు 30 నుంచి 40 నిమిషాల సమయం పడుతున్నందున రోజూ 15 ఇళ్లు సర్వే చేయడం అసాధ్యమని, ఈ సమస్యను అధికారులు పరిశీలించాలన్నారు. కచ్చితంగా చేయాలని ఒత్తిడి తెస్తున్నారని, అలా చేస్తే సర్వేలో తప్పిదాలు దొర్లే అవకాశాలున్నాయని పేర్కొన్నారు. ఉపాధ్యాయుల సమస్యలను దృష్టిలో పెట్టుకుని పరిష్కరించాలని కోరారు.

ఉచిత వైద్య శిబిరం

రాయికల్: మండలంలోని బోర్నపల్లిలో బుధవారం రాయికల్ పట్టణంలోని శ్రీసత్య హాస్పిటల్ వైద్యులు ఉదయ్‌కుమార్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. 200 మందికి పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. మాజీ సర్పంచ్ పాదం లతరాజు, కోల శ్రీనివాస్, నాయకులు పాల్గొన్నారు.

బీరు బాటిల్‌లో చెత్త.. యువకుల ఆందోళన

కథలాపూర్: మండలకేంద్రంలోని ఓ వైన్‌షాపులో బుధవారం సాయంత్రం యువకులు బీరు బాటిల్ కొనుగోలు చేయగా, చెత్తాచెదారం వచ్చిందని ఆందోళన చేశారు. వైన్‌షాపు నిర్వాహకులతో వాదనకు దిగారు. అధికారులు చర్యలు తీసుకోవాలంటూ నినాదాలు చేశారు. అక్కడున్నవారు యువకులకు సర్ది చెప్పడంతో వివాదం సద్దుమణిగింది.